## 1-34

## మున్నుడి

ఆంజనేయుడు, నృసింహుడు తెలుగునాట ఇలవేల్పులు. ఆయా సందర్భాలలో అన్నమాచార్యులవారూ ఆ మహానుభావుల ఆలయాలను ఎన్నో ఊళ్ళల్లో సందర్శించి ఆశువుగా అద్భుతమైన కీర్తనలు చెప్పారు. ఏ దైవాన్ని కొలిచినా ఆయన భావనార్ణవంలో ఆంజనేయుడు కూడా తిరుమలేశుని బంటే. చేతులు ముడుచుకొని భక్తితో కొండలయ్య ముందు వినమ్రుడై నిలుచున్న అంజనీసుతుని ఇంతకంటే మధురంగా ఎవరన్నా కీర్తించగలరా? అజరామరణమైన సంకీర్తన ఇది.

**చ॥ వెనకడుగేయకుండ వినువీధికి దూకెను లంకజేరగా**
**హనుమ, మహాద్భుతంబయిన ఆకృతి జూచిన వానరోత్తముల్**
**మనుముల శాంతినొందిరట, మారుతి గొల్చెను అన్నమయ్య తా**
**ననఘుడు వేంకటేశ్వరుడు అంజని సూనుని దైవమంచనెన్.**

**రాగం : ధర్మావతి**

మంగాంబుధి హనుమంత నీశరణ
మంగవించితిమి హనుమంతా ॥మంగాం బుధి॥

బాలార్క బింబము ఫలమని పట్టిన
ఆలరి సేతల హనుమంతా
తూలనె బ్రహ్మాదులచే వరములు
ఓలి చేకొనిన ఓ హనుమంతా ॥మంగాంబుధి॥

జలధి దాట నీ సత్వము కపులకు
అలరి తెలిపితివి హనుమంత
ఇలయు నాకసము నేకముగా నటు
బలిమి పెరిగితివి భళి హనుమంత ॥మంగాంబుధి॥

పాతాళము లోపలి మైరావణు
ఆతల చంపిన హనుమంత
చేతులు మోడ్చుక శ్రీవేంకటపతి
నీతల కొలిచే హిత హనుమంత ॥మంగంబుధి॥

## భావామృతం

ఓమంగాంబుధి హనుమంతా! మేము నీకు శరణు అని వేడుకొంటున్నాము ప్రభూ! పసి బాలునిగా నున్నప్పుడే నీవు బాల భానుని బింబమును ఏదోపండు అనుకొని పట్టి తిన బోయావు. నీవన్నీ అల్లరి చేష్టలేనాయె! అప్పుడు జరిగిన పర్యవసానంగా బ్రహ్మాది దేవతల చేత సాటిలేని వరములను కానుకగా పొందావు.

శతయోజన విస్తీర్ణమైన సముద్రమును దాటి సీతాన్వేషణ జయప్రదంగా ముగించి, రామకార్యం నెరవేర్చి , నీ'సత్తా' ఏమిటో కిష్కింధలోని వానరులందరికీ తెలుపకనే తెలిపావు. భూనభోంతరాళము విస్తరించిన నీమహాకాయమును చూపి బలవంతుడవై పెరిగిన నీగొప్పతనం భళిరా! అసామాన్యం కదా!

పాతళలోక వాసియైన మైరావణుడనే రాక్షసుడొకడు రామలక్ష్మణుల మాయోపాయంతో ఎత్తుకుపోయి బలి ఇద్దామనుకొన్నాడు.

'బుద్ధిమతాం వరిష్టం' అని పేరొందిన హనుమ తన తెలివితేటలతో వానిని తుదముట్టించి రామలక్ష్మణులను రక్షించాడు. అంతటి మహోన్నతుడైన ఈ మంగాంబుధి హనుమ తన చేతులన సవినయంగా ముడుచుకొని, శ్రీవేంకటేశ్వరుని (తన శ్రీరామచంద్రుని మారు రూప మన్నట్లుగా) సవినయంగా ఇక్కడ కొలుస్తున్నాడు హితములను గూర్చు ఈ హనుమంతుని అంజలి ఘటించి ఆరాధించండి.

# సామంతం

మంగాంబుధి హనుమంతుని (తనీ?) శరణ
మంగవించితిమి హనుమంతా ॥ పల్లవి ॥

బాలార్కబింబము ఫలమనిపట్టిన
ఆలరిచేఁతలహనుమంతా
తూలనిబ్రహ్మాదులచే వరములు
వోలిఁజేకొనిన వో హనుమంతా ॥ మంగా ॥

జలధిదాఁట నీ సత్వము కపులకు
నలరి దెలిపితివి హనుమంతా
యిలయు నాకసము నేకముగా నటు
బలిమిఁ బెరిగితివి భళి హనుమంతా ॥ మంగా ॥

పాతాళములోపలి మైరావణు -
నాతలఁ జంపిన హనుమంతా
చేతులు మోడ్చుక శ్రీవేంకటపతి -
నీతలఁ గొలిచే హిత హనుమంతా ॥ మంగా ॥